

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎంపీ ఆర్. కృష్ణయ్య తదితరులు

హాస్టళ్లలో సదుపాయాలను మెరుగుపర్చాలి

● ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో సదుపాయాలు మెరుగుపర్చి పౌష్టికాహారంతో భోజనం పెట్టాలని, మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. గురుకుల పాఠశాలలో హాస్టళ్లలో సరైన సదుపాయలు లేకపోవడంతో 36 మంది చనిపోయారని, 800 మంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. హాస్టల్స్‌కు నూతన భవనాలు నిర్మించాలని, ఫీజుల బకాయిలు 4 వేల కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఈ అంశంపై చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆర్. కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు వేముల రామకృష్ణ, రాజేందర్, రామ్మూర్తి, బలరాం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్ ఆస్పత్రిలో మూసివేసిన ఓపీ సేవలు

ఫీవర్ ఆస్పత్రిలో మూడో రోజూ ఓపీ బంద్

● ఇబ్బందులు పడ్డ రోగులు

బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో మూడో రోజూ వైద్యులు సమ్మె చేయడంతో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. వివిధ జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు నానా అవస్థలు పడ్డారు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా వైద్యులు సమ్మె నిర్వహిస్తున్న విషయం విదితమే. ఎమర్జెన్సీ కేసులు, కుక్క కాటు బాధితులకు వ్యాక్సిన్ వేశారు. ఓపీ సేవలు వరుసగా మూడు రోజులు బంద్ కావడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక రోగులు అవస్థలు పడుతున్నారు.



పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వీరన్నగుట్ట మహాశివాలయం ఆవరణలో జంధ్యాదారణం చేసిన వ్యక్తులు

వీరన్నగుట్టలో సామూహిక యజ్ఞోపవీత ధారణ

గోల్నాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ వీరన్నగుట్ట మహాశివాలయం వద్ద అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ పూజ నిర్వహించి అందరు జంధ్యాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులు కుందెన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ తీగల నరేందర్, ప్రతినిధులు పి.మధుసూధన్, గంగిశెట్టి మల్లేష్, డివిజన్ అధ్యక్షుడు పి.దామోదర్, కడిగె శ్రీనివాస్, నక్క రమేష్, ఇడెం యాదగిరి, కమల్‌రాజు, బింగి మల్లేశం, కోట వెంకటష్ పాల్గొన్నారు.



కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉమేష్ తదితరులు

డివిజన్ ప్రజల సేవలో ఎల్లప్పుడూ ఉంటా

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రజలకు సేవలు అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని డివిజన్ మహిళా మోర్చా, దళితమోర్చా బీజేపీ, బీజేవైఎం, పలువురు సీనియర్ నేతలు కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను సన్మానించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల నాయకులు వినయ్‌కుమార్, మెతుకు ఉమేష్, ధనరాజ్, అరుణ్‌కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

● జంగా శ్రీనివాస్

కవాడిగూడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ విభజన, క్రిమిలేయర్ తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న నిర్వహించే భారత్ బంద్ విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో- కన్వీనర్ జంగా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం దోమలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు పొందుపరచిన ప్రత్యేక హక్కులకు ఆటంకం, నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో నేడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సూచనల మేరకు తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ భారత్ బంద్‌ను అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... 45 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని మహిళ సోమవారం ఉప్పుగూడ-యాకత్‌పూర రైల్వే స్టేషన్ల నడుమ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ చేసి మోసాలకు పాల్పడిన దొంగలు

బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగలు తస్కరించడమే కాక తప్పుడు మెసేజ్‌లు పంపి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... రామంతాపూర్‌లో నివాసం ఉంటున్న నాగభూషణం ఈ నెల 14న బెంగళూరుకు వెళ్లాడు. అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగలు తస్కరించారు. నాగభూషణం హెల్త్ సీరియస్‌గా ఉందని డబ్బులు అర్జెంట్‌గా పంపాలని సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్లకు తప్పుడు మెసేజ్‌లు పెట్టారు. దీంతో నాగభూషణం స్నేహితులు దాదాపు 60 వేల రూపాయల వరకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న నాగభూషణం సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణకు బెంగళూరు రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా 'రక్షాబంధన్'

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి, స్వీటు తినిపించి సోదర ప్రేమను చాటుకున్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు కూడా పలువురు రాఖీలు కట్టారు.



హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాఖీ కడుతున్న బీజేపీ మహిళా నాయకురాలు బండారు రాధిక, కళావతి, శారద



సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయదవ్



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి ప్రశాంతి, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు



బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్‌కు రాఖీ కడుతున్న సోదరి, మహిళలు



ఈస్ట్ పార్సీగుట్ట మున్సిపల్ కాలనీలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



ఇందిరాపార్కులో జరిగిన రక్షా బంధన్ వేడుకలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌యాదవ్ తదితరులు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టిన ముషీరాబాద్ బీఆర్ఎస్ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు మేరీ



ముషీరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేందర్‌కు రాఖీ కడుతున్న మహిళలు



నింబోలిఅడ్డలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు



రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో జరిగిన రాఖీ వేడుకల సందడి



కాచిగూడ డివిజన్‌కు చెందిన ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్ యాదవ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న ప్రీతం, తదితరులు

'కిలిమంజారో'ను అధిరోహించిన నగర విద్యార్థి

● పిన్నవయస్కుడిగా రికార్డు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రీతం గోలి(16) మౌంట్ కిలిమంజారోను అధిరోహించాడు. నగరం నుంచి ఈ ఫీట్‌ను సాధించిన అతి పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు. ఎనిమిది రోజులపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని మౌంట్ కిలిమంజారోను జూలై 17న అధిరోహించినట్లు ప్రీతం తెలిపారు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న అతడు సత్యరూప్ సిద్ధాంత్ మార్గదర్శకత్వంలో నలుగురు క్లైంబర్స్‌తో ఈ యాత్ర పూర్తి చేశాడు. కిలిమంజారో పర్వతంపై జాతీయ పతాకంతో పాటు ఎన్‌సీసీ ఫ్లాగ్, స్కూల్ ఫ్లాగ్స్‌ను ఎగురవేసినట్లు తెలిపాడు. ఈ పర్వతాన్ని అధిరోహించిన తొలి ఎన్‌సీసీ కేడెట్ కూడా తానే అని ఈ సందర్భంగా వెల్లడించాడు.



నటులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పోటాపోటీగా పద్యాల ఆలాపన

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెంకటకవులు రచించిన పాండవోద్యోగ విజయాలు నాటకంలోని శయన దృశ్యంలో నటులు పోటాపోటీగా పద్యాల ఆలాపనతో ప్రేక్షకులను రంజింపచేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పద్యాల ఆలాపన కార్యక్రమం జరిగింది. కృష్ణునిగా పున్నారావు, దుర్యోధనుడిగా సంజీవరావు, అర్జునుడిగా నారాయణస్వామిల నటన, పద్యాల ఆలాపన ప్రశంసనీయంగా ఉన్నాయి. ప్రముఖ హార్మోనిస్టు రాజాబాబు సంగీత సహకారంతో నాటక ప్రదర్శనను రక్తికట్టించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొని సంగీత నృత్య నాటక కార్యక్రమాలకు రెండు రోజులు శారద కళానికేతన్ వారికి ఉచితంగా వేదిక ఇచ్చామని వివరించారు. నిర్వాహకుడు రాజబాబు మాట్లాడుతూ పౌరాణిక నాటక ప్రదర్శనకు చాలా ఖర్చు అవుతుందని ప్రేక్షకులు స్పందన లేకుంటే తెలుగు పద్య నాటకం కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌జెండర్ సమస్యలపై హెల్ప్‌డెస్క్

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో దివ్యాంగుల సంక్షేమశాఖలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్‌ను మూసివేశారు. దానికి ప్రత్యామ్నాయంగా పీడబ్ల్యూడీ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌జెండర్స్ తమ సమస్యలను 155326 నంబర్‌కు తెలియజేయాలని సంబంధిత అధికారులు సూచించారు.



గంగపుత్రకాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

గంగపుత్రకాలనీలో దోమల నివారణకు ఫాగింగ్

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీలో దోమలు అధికంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్, జీహెచ్‌ఎంసీ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది గంగపుత్రకాలనీలో సాయంత్రం ఫాగింగ్ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

కళల ద్వారానే జాతీయ సమైక్యత సాధ్యం

రవీంద్రభారతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ కళల ద్వారానే సాంస్కృతి వికాసం, ధార్మిక జీవన, పరస్పర ప్రేమ ఉద్భవిస్తాయని జాతీయ సమైక్యత సాధ్యమవతుందని ప్రముఖసాహితీవేత్త వల్లీశ్వర్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణ సౌరభాలు శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్య, సంగీత, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వల్లీశ్వర్ హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక ఇబ్బందులు ఉన్నా సాంస్కృతిక సంస్థలు కళలకు ప్రాధాన్యతనిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఇంటలిజెన్స్ ఎస్పీ (విజయవాడ) రామ్మోహన్, కథక్ నృత్య గురువు అంజిబాబు, నటి సంధ్య, కావ్యరెడ్డి, రఘుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్‌లోని మూసారాంబాగ్‌లో డెంటల్ వైద్యులు పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేశారు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల ముగింపులో కలశాలతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

ముగిసిన పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల అనంతరం పవిత్రోత్సవాలు నిర్వహించడం పరిపాటి. ఈ సందర్భంగా పూర్ణాహుతి, 41 కలశములతో అభిషేకం, మహానైవేద్యం, మంత్రపుష్పము, చందనగోష్ఠి, ఆశీర్వాదం, పండితసన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు కలశము, స్వామివారి పవిత్రము అందజేశారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఉత్సవాల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు సత్కారం



తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంను సోమవారం 1969 తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు సుధాకర్ కలిసి శాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకారులను ఆదుకోవాల్సిన బాధ్యత కోదండరాంపై ఉందని ఉప్పు సుధాకర్ కోరారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి



గౌరీ శంకర ఆలయ ప్రాంగణంలో గాయత్రీ హోమం నిర్వహిస్తున్న ముషీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు సంగిశెట్టి రాజ్‌కుమార్

భక్తి శ్రద్ధలతో గాయత్రీ హోమం

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండగను పురస్కరించుకోని ముషీరాబాద్‌లోని గౌరీ శంకర ఆలయ ప్రాంగణంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు సంగిశెట్టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గాయిత్రీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాఖీ పండగ రోజు గాయిత్రీ హోమం నిర్వహిస్తూ పద్మశాలీలలో ఐక్యతను పెంపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ పద్మశాలి సంఘం కార్యదర్శి చక్రవర్తి, కోశాధికారి నాగమూర్తి, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనడానికి చిన్నారులకు ఆహ్వానం

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా ఈ నెల 26న త్యాగరాయగానసభ కళామారుతీ వేదికలో శ్రీకృష్ణ వేషధారణ, సంగీత, శాస్త్రీయ నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి కృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన గానసభలో మాట్లాడుతూ పాల్గొనే చిన్నారులు 23వ తేదీలోగా సంప్రదించాలన్నారు.

బీసీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా రాష్ట్రంలోని బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో దశరథం మాట్లాడారు. ర్యాంకులతో సంబంధం లేకుండా ఏ ర్యాంకు వచ్చినా మొత్తం ఫీజు రీయంబర్స్‌మెంట్ చేస్తామని, రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతిగౌడ్, ఉపాధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.